ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శనివారం 17 ఆగస్టు 2024



గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	585.10 (297.7235)	3,72,073	3,54,618
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	370.08	370.08
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	157.47 (22.74)	3,71,605	1,08,895

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.180

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వానాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు





మోత్కూరు, సూర్యాపేటటౌన్, నల్లగొండ, ఆగస్టు 16: వానాకాలం ప్రారంభమై రెండు మాసాలు గడిచింది. అయినా ఉక్కపోత తగ్గడం లేదు. పగలు ఎండ తీవ్రత, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రస్తుత వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షాలే కురిశాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి వచ్చిన నీరంతా కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదే. కాగా, ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా చెరువులు, కుంటలు నిండనేలేదు. భారీ వర్షాలు లేకపోగా, ఉక్కపోత, ఎండలకు జనం తాళలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ జలాశయం, మూసీ, పులిచింతల ప్రాజెక్టులు నిండాయి. సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద రాగా, మూసీకి హైదరాబాద్ నగరం నుంచి వరద వచ్చి చేరడంతో అవి నిండాయి. యాదాద్రి జిల్లాలో చెరువులతోపాటు బిక్కేరు వాగులో చుక్క నీరు లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 21 మి.మీ తక్కువగా వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాకాలం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు అడపాదడపా మోస్తరు వర్షాలే తప్ప భారీ వర్షాలు లేవు. దీంతో వాతావరణం చల్లబడలేదు. నడి వానాకాలంలో ఎండ తీవ్రత అధికమైంది. ఐదారు రోజులకోసారి చినుకులు పడుతున్నాయి. చినుకులకు ముందు ఉక్కపోత ఉంటోంది. వేసవి కాలంలా శరీరమంతా చెమట ప్రజలను చిరాకు కలిగిస్తోంది. ఫ్యాన్లు తిరుగుతున్నా ఉపశమనం కలగడం లేదు. రాత్రివేళల్లో సైతం ఫ్యాన్‌గాలి సరిపోవడం లేదు. మరోవైపు దోమల బెడద ఎక్కువైంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఏ చిన్న ఆస్పత్రికి వెళ్లినా పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. రోజూ సుమారు 30 నుంచి 40 మంది జ్వరంతో బాధపడేవారు వస్తున్నారని మోత్కూరులోని ఓ ప్రైవేట్ డాక్టర్ తెలిపారు. జ్వరం వచ్చిన వారిలో డెంగీ లక్షణాలు లేకున్నా ప్లేట్‌లెట్లు పడిపోతుండటంతో రోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇళ్లలో ఏసీ సౌకర్యం ఉన్నవారు ఉక్కపోత భరించలేక ఏసీ వినియోగిస్తే జలుబు, జ్వరాలు వస్తున్నాయంటున్నారు. వాతావరణ సమతుల్యత లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎండల తీవ్రతకు వరి నాట్లు పుంజుకోవడం లేదు. వేసిన నాట్లు కూడా అక్కడక్కడా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన ముసురుతో కొంతమేర పత్తి చేలు గట్టెక్కాయని రైతులు భావించినా, మళ్లీ వర్షాలు లేకపోవడంతో చేలు వాడు ముఖం పడుతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతంలో మెట్ట పంటలపై వర్షాభావం, ఎండల ప్రభావం కనిపిస్తోంది. భారీ వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో వరి సేద్యం ఇబ్బందిగా మారింది. బోర్లలో నీరు తగ్గి ఆగి ఆగిపోస్తున్నాయి. దీంతో ఐదెకరాలు నాటు పెడదామనుకున్నా రైతులు రెండెకరాలు కూడా నాట్లు వేయలేకపోయారు. ఫలితంగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో వరిసేద్యం గణనీయంగా పడిపోయింది.



పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజులుగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూలై నెలలో పక్కకు పడేసిన కూలర్లను ప్రజలు పగలు రాత్రి తేడా లేకుండా వినియోగిస్తున్నారు. ఏసీలకు అలవాటు పడినవారు వాటిని ఆన్‌చేస్తున్నారు. పగటి ఉష్ణోగ్రత 36 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. శుక్రవారం 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్ర 6.30 తరువాతే కాస్త వాతావరణం చల్లబడుతోంది. రాత్రి సమయంలో ఉక్కపోతతో సరేసరి. ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తుండటంతో మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 4,51,501 గృహజ్యోతి కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నవారు 2,10,528 మంది ఉన్నారు. అయితే ఫ్యాన్లు రోజంతా నడుస్తుండటంతో యూనిట్లు పెరిగి ఈ నెల విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శీతలపానీయాలకు భలే గిరాకీ



ఎండ తీవ్రతతో శీతల పానీయాలకు భలే గిరాకీ పెరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత వేసవి కాలంలో సుమారు 60 నుంచి 80 వరకు జ్యూస్ పాయింట్లు ఉండగా, వానాకాలం రావడంతో అందులో కొన్నింటిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం 30 వరకు జిల్లా కేంద్రంలో జ్యూస్ పాయింట్లు నడుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా ఉక్కపోత, వేడి పెరగడంతో ప్రజలు జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో గతంలో కంటే ధర పెంచి వ్యాపారులు శీతలపానీయాలను విక్రయిస్తున్నారు. అంతేగాక సీజనల్ వ్యాధుల బారిన పడుతుండడంతో ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో కొబ్బరి బొండం రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.50 వరకు విక్రయిస్తున్నారు. అంతేగాక లీటర్ కొబ్బరి నీళ్లకు గతంలో రూ.150 నుంచి రూ.160 వరకు ధర ఉండగా, ప్రస్తుతం లీటర్ కొబ్బరి నీళ్ల రూ.200కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో పుచ్చకాయల విక్రయాలు పెరిగాయి. వీటి ధరను వ్యాపారులు పెంచి విక్రయిస్తున్నారు. మరి కొద్దిరోజులు ఇలాగే వాతావరణం ఉంటే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే వాతావరణంలో మార్పులు సహజమని, త్వరలో వాతావరణం చల్లబడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

బయోమెట్రిక్ ద్వారానే హాజరు నమోదు: కలెక్టర్



బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 16 : జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఫేస్ రికగ్నైజేషన్(ముఖ గుర్తింపు) ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన బయోమెట్రిక్ పరికరంలో తన హాజరు నమోదు తీరును ఆయన పరిశీలించారు. జిల్లాలోని అధికారులు విధిగా తమ తమ కార్యాలయాల్లో మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే 720 మందికి ప్రస్తుతానికి 488మంది మాత్రమే బయోమెట్రిక్‌లో నమోదు చేసుకున్నారని మిగిలిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 16 : మహిళలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా నాయకులు మండిపడ్డారు. మహిళలపై కేటీఆర్ అనుచిత వాఖ్యలకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంపై ఎమ్మెల్యే కేటీఆర్ మహిళలను కించపరిచేలా మాట్లాడడం దారుణమన్నారు. మహిళలపై మరోమారు ఇలాంటి అనుచితవ్యాఖ్యలు చేస్తే సరైన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేములకొండ పద్మ, గండూరి రాధిక, నామాఅరుణ, గాజుల రాంబాయమ్మ, శిరీష పాల్గొన్నారు.

పదేళ్లు మోసం చేసిన బీఆర్ఎస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సూర్యాపేట టౌన్, ఆగస్టు 16: పదేళ్ల పాటు బీఆర్ఎస్ పేదలకు ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 126లో నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తుంటే గతంలో బీఆర్ఎస్ నాయకులు వారి గుడిసెలు తీసివేయాలంటూ ఇబ్బందులకు గురిచేశారన్నారు. తిరిగి ప్రస్తుతం మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గుడిసెలు వేసుకొని జీవిస్తున్న ప్రజల పక్షాన వారికి న్యాయం జరిగే వరకూ మాస్‌లైన్ పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో నిలువ నీడలేక అనేకమంది ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, సూరం రేణుక, గులాం హస్సేన్, వీరబాబు, రాంజీ, వాజిద్, మోహన్, ఫరూఖ్, మోహన్, పద్మ, ఎల్లమ్మ, విజయ్, శంకర్, రవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

• 8లో



జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బాబోయ్ దొంగలు

వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంటికి తాళం వేసి వెళ్లిందే తడువు చోరీ జరిగిపోతోంది. కొద్దిసేపు బయటకు వెళ్లి వచ్చే సరికి చోరీ జరుగుతోంది. వీటికి తోడు చైన్‌స్నాచింగ్‌లు రోడ్డు వెంట ఒంటరిగా వెళ్తే చాలు మహిళల మెడలోని గొలుసులను లాగేస్తున్నారు. వరుసగా ఘటనలు జరుగుతున్నా పోలీసులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారు. కొద్ది నెలల వ్యవధిలోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వాటిపై పోలీసులు దృష్టి సారించారు. దీంతో చోరీలు ఎక్కువయ్యాయి. ఈ ఏడాదిలో 42చోరీలు జరగ్గా సుమారు రూ.74లక్షల సొమ్ము అపహరణకు గురైంది. దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు.

\- సూర్యాపేటక్రైం



- ఇంటికి తాళం వేసి వెళ్లామా..వచ్చేలోపు చోరీ
- ప్రజలను భయపెడుతున్న వరుస ఘటనలు
- జిల్లాలో ఇటీవల పెరిగిన చోరీలు
- ఈ ఏడాదిలో 42 చోరీలు, రూ.74 లక్షల సొత్తు అపహరణ

జిల్లాలోని ప్రజలు ఇంటికి తాళం వేసి ఏదైనా పనినిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇతర ప్రాంతం నుంచి ఇంటికి తిరిగి వచ్చేలోపు ఇంట్లో చోరీ జరుగుతోంది. కొంత మంది చోరీలకు భయపడి డబ్బులు వెచ్చించి వివిధ బ్యాంకుల్లో లాకర్లు తీసుకుని విలువైన ఆభరణాలను భద్రపర్చుకుంటున్నారు. చోరీలు మారుమూల గ్రామాలకో, శివారు ప్రాంతాలకో పరిమితంకావడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పట్టణాల్లోనూ ఇటీవల మరింత పెరిగాయి. కోదాడ, నేరేడుచర్ల, హుజూర్‌నగర్ పట్టణాల్లో జరిగిన చోరీల్లో రూ.లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు అపహరణకు గురైంది. అదేవిధంగా పెన్‌పహాడ్, మేళ్లచెర్వు, చివ్వెంల, కోదాడ పట్టణం, హుజూర్‌నగర్, తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల పరిధిలో ఇటీవల చోరీలు జరిగాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 42 చోరీలు జరగ్గా సుమారు రూ.74లక్షల మేర సొమ్ము అపహరణకు గురైంది.

బాధితులకే భయం వేసేలా..

చోరీల విషయంలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు కేసులు మాత్రం నమోదు చేయడం లేదు. ఇదే సమయంలో బాధితులను వివిధ రకాల ప్రశ్నలు వేసి భయాందోళనకు గురిచేసి ఫిర్యాదు చేయకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నారు.

కరువైన పోలీస్ నిఘా

చోరీలను అరికట్టాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ రకాల విధులు, సిబ్బంది కొరత కారణంగా పెట్రోలింగ్ సరిగా చేయడంలేదన్న అపవాదు ఉంది. పోలీస్ అధికారులు కూడా శాంతిభద్రతల పరిరక్షణపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదని చర్చ జరుగుతోంది. పలువురు పోలీస్ అధికారులు స్టేషన్లలో తక్కువ సమయం కేటాయిస్తూ వారి సొంత పనులకు సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాలు పని చేయడం లేదు. అవి మరమ్మతుకు గురైతే వాటిని పట్టించుకోవడం లేదు. సీసీటీవీ కెమెరాలు పని చేస్తే నేరాల ఛేదన చాలా సులభమవుతుంది. కానీ పోలీస్ అధికారులు మాత్రం ఈ విషయంలో పట్టింపులేకుండా ఉంటున్నారు.

● అమెరికా నుంచి అప్రమత్తం చేయడంతో...



ఈ నెల 14న పీఎస్‌ఆర్ కాలనీలో చోరీకి వచ్చిన ముసుగు దొంగ

చివ్వెంల మండలం కుడకుడ శివారులోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో దొంగలు ఈ నెల 14న అర్ధరాత్రి చోరీలకు పాల్పడ్డారు. అయితే నెల కిందట కూడా ఇదే టౌన్‌షిప్‌లో చోరీలు జరిగాయి. దీంతో కొందరు ఇంటి యజమానులు వారి ఇళ్లకు సీసీకెమెరాలు ఏర్పాటుచేసుకున్నారు. అంతేకాకుండా టౌన్‌షిప్‌లోని వీధుల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న కాలనీకి చెందిన నూనె సత్యనారాయణ ఇటీవల అమెరికా వెళ్లాడు. మన దేశంలో రాత్రి అయితే అక్కడ పగలు కావడంతో ఆయన ఈ నెల 14న సెల్‌ఫోన్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో కాలనీలోని మూడు నివాసాల్లో చోరీ చేసిన దొంగలు సత్యనారాయణ ఇంట్లో చోరీ చేస్తుండగా సీసీ కెమెరాలో సత్యనారాయణ గమనించాడు. వెంటనే టౌన్‌షిప్‌లోని ప్రజలను అప్రమత్తం చేశాడు. దీంతో వారు దొంగలను పట్టుకునేందుకు సిద్ధం కావడంతో గమనించిన దొంగలు పరారయ్యారు. కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను పోలీసులు సేకరించారు.

ఎవరు వీళ్లంతా?

జిల్లాలో వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. వారు ఎవరనే విషయాన్ని పోలీసులు గుర్తించలేకపోతున్నారు. ఈ నెల 14న కుడకుడలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లోకి చొరబడిన దొంగలు చేతులకు గ్లౌజులు, ముఖానికి మంకీ క్యాప్‌లు, చేతి రుమాళ్లు ధరించి గుర్తుపట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. సంఘటనా స్థలాల్లో దొంగలు ఎలాంటి ఆధారాలు లభించకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఒక్కో చోట ఒక్కో తీరుతో చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఏ ప్రాంతం వారు చోరీలకు పాల్పడుతున్నారనే విషయాలను పసిగట్టలేకపోతున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన మాటలను బట్టి వరంగల్ ప్రాంతానికి చెందిన కొందరు దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

దొంగలను పట్టుకుంటాం



త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. జిల్లాలో ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాలు పని చేసేటట్లు చర్యలు తీసుకుంటాం. దొంగతనాలపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. చోరీకి గురైన సొమ్మును తిరిగి రాబడతాం. తక్కువగా సిబ్బంది ఉన్న పోలీస్‌స్టేషన్లకు అదనపు సిబ్బందిని నియమిస్తాం. పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తాం. జిల్లా వ్యాప్తంగా సీసీకెమెరాలు అవసరమైన మేరకు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

\- సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

జిల్లాలో ఇటీవల చోరీలు కొన్ని

- సూర్యాపేటలోని అంజనాపురి కాలనీలో ఈ ఏడాదిలో పలు నివాసాల్లో పలుమార్లు చోరీలు జరిగాయి. లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి.
- గతేడాది డిసెంబరులో సూర్యాపేటలోని న్యాయవాది నివాసంలో చోరీ జరిగింది. సుమారు రూ.4లక్షల నగదు, ఆరు వేల అమెరికా డాలర్లు, 10 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- హైటెక్‌కాలనీలోని ఉపాధ్యాయుడి నివాసంలో సుమారు 17 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- మఠంపల్లి మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో సుమారు రూ.20లక్షల విలువైన ఆభరణాలతో పాటు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.
- హుజూర్‌నగర్‌లో మూడు ఇళ్లలో జరిగిన చోరీల్లో 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురైంది.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం



అభివాదం చేస్తున్న మాల మహానాడు నాయకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 16: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు గడమళ్ల చెన్నయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు మాలలకు వ్యతిరేకంగా ఉందని, 11 మంది ధర్మాసనంతో కూడిన బెంచి ఏర్పాటు చేసి తీర్పును పునఃసమీక్షించాలన్నారు. ప్రతీ గ్రామం నుంచి మాలలు చైతన్యవంతులై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మాల ప్రజాప్రతినిధులు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై పార్టీలు రాజకీయలు మానుకోవాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15 శాతం నుంచి 23 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, జలగం కరుణాకర్, పెరుమాళ్ల శ్రీనివాస్, రవి, కట్ల మురళి, కట్ట సైదులు, వేణు, బలరాం, అనిల్, పిట్టల భాగ్యమ్మ, చెవుల నాగరాజు, పడిగెరెక్క సంజయ్, జానకిరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

20 మంది నాగసాధువులతో ప్రత్యేక పూజలు



మహారుద్రాభిషేక కార్యక్రమంపై సమీక్షిస్తున్న పుర ప్రముఖులు, నిర్వాహకులు

హుజూర్‌నగర్, ఆగస్టు 16 : హుజూర్‌నగర్ పట్టణంలో అక్టోబరు 27న చేపట్టే మహారుద్రాభిషేకంలో 20 మంది నాగసాధువులు పాల్గొంటారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆధ్యాత్మిక వేత్తలు రాజారవివర్మ, గజ్జి ప్రభాకర్, పొలిశెట్టి నరసింహారావు, గుండా శ్రీనివాస్ కోరారు. శుక్రవారం పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లోకకల్యాణార్థం గుంటూరుకు చెందిన అమ్మ ఆశ్రమం గురూజీ బాబా ఆధ్వర్యంలో నాగసాధువులతో హుజూర్‌నగర్‌లో మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, సుమారు 20వేల మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. మహారుద్రాభిషేకంలో పసుపు,కుంకుమ 200 కిలోలు, విభూది 300 కిలోలు, సింధూరం 150 కిలోలు,ఆవుపాలు 150 లీటర్లు, లక్షరుద్రాక్షలు, నవగ్రహ దినుసులు, నవగ్రహ పిండ్లు 25 కిలోలు, 10 కిలోల ఆవునెయ్యి, పుట్టతేనె 10 కిలోలు, 600కిలోల వివిధ రకాల పూలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో కళకళలాడాలని ఈ మహారుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఓరుగంటి నాగేశ్వరరావు, సూర్యప్రకాష్‌రావు, అమర్, కీత మల్లికార్జున్, ఏలూరి రాంబాబు, అయ్యప్ప, ప్రతాప్‌రెడ్డి, కోటయ్య, నాగిరెడ్డి, అశోక్, శ్రీనివాస్, శ్రీనివాసరాజు, అనిల్, మురళీ పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో పవిత్రోత్సవాలు పరిసమాప్తి

● నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఆగస్టు 16: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో, పాతగుట్ట ఆలయంలో మూడు రోజులుగా కొనసాగిన పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శుక్రవారం ఉదయం ప్రధానాలయంలో నిత్య కైంకర్యాల అనంతరం ఉత్సవమూర్తులను నవకలశాలతో స్నపన తిరుమంజనాలు చేసి ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేకసేవలో తీర్చిదిద్దారు. ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని యాగశాల వద్దకు ఊరేగింపుగా తరలించి, హోమాది పూజలు చేపట్టారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు. మహా కుంభకలశాన్ని పవిత్రీకరించిన 108నూలుపోగులతో తయారుచేసిన మాలలను అంతరాలయంలో మూలమూర్తులు, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను అలంకరించారు. అనంతరం దివ్య విమాన గోపురంపై సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకబృందం పవిత్రమాలలు అలంకరించింది. వేద మంత్రాలతో పవిత్రీకరించిన సప్తవర్ణాలలో 108నూలు, పట్టుపోగులతో తయారు చేసిన పవిత్రమాలలను స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రోచ్చరణలతో అలంకరించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు. నేటి నుంచి అర్జిత సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకబృందం

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట కొండపై శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్దారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.23,07,813 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా మరో రూ.10లక్షలు లీజులకు సంబంధించి ఆదాయం సమకూరిందని తెలిపారు.

ఉపాధి వేతనాలు వచ్చాయ్

● జూలై వరకు రూ.32.35 కోట్ల చెల్లింపు



మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: ఉపాధిహామీ పథకం కింద పనులకు హాజరైన కూలీలకు చెందిన పెండింగ్ వేతనాలు వచ్చాయి. మే నుంచి జూలై నెల వరకు వేతనాల చెల్లింపు ప్రక్రియ పలు కారణాలతో స్తంభించింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ఈ నెల 9వ తేదీన 'పది వారాలుగా .. పైసా ఇవ్వలే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. దీంతో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉన్న పెండింగ్ వేతనాలు చెల్లించారు. మే నుంచి జూలై నెలాఖరు వరకు రూ.32కోట్ల నిధులను విడుదల చేయగా, నల్లగొండ జిల్లాలోని కూలీలకు రూ. 14.55 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 11.32 కోట్లు, యాదాద్రిభువనగిరి జిల్లాలో రూ. 6.47కోట్ల పెండింగ్ వేతనాల చెల్లింపు ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లిన కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యాయి. ఉపాధి వేతనాలు తమ ఖాతాలో జమకావడంతో కూలీలకు కొంతమేర ఆర్థికపరమైన ఊరట దక్కింది. మిగతా నిధులు సైతం త్వరలోనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.

మొత్తం వేతనాలు చెల్లిస్తాం

ఉపాధిహామీ పథకానికి ఈ ఏడాది విశేష ఆదరణ లభించింది. దీంతో వార్షిక బడ్జెట్‌లో 90 శాతం వరకు పనిదినాలు పూర్తయ్యాయి. పనులకు హాజరైన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వారం ఈ- మస్టర్‌రోల్‌లో నమోదైన హాజరు పట్టిక వివరాలను ఎన్‌ఐసీ ద్వారా సీఆర్‌డీకి అప్‌లోడ్ చేశాం. త్వరలోనే పూర్తిస్థాయిలో వేతనాల చెల్లింపు ప్రక్రియ ముగుస్తుంది. కూలీలు ఎలాంటి అపోహలకు లోనవద్దు.

-శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో, నల్లగొండ

రాఖీ పంపాలా... ఆర్టీసీ కార్గో సర్వీసు ఉందిగా..

నల్లగొండ, మిర్యాలగూడటౌన్, ఆగస్టు 16: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలను అందజేయనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, ఆర్టీసీ డిపో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పీఎస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనురాగాన్ని ఆప్యాయతలను పంచుకొనేందుకు, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పుకనేందుకు రాఖీలను పంపించడానికి ఆసక్తి ఉన్న వారు కార్గో బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. కార్గో బుకింగ్‌ల కోసం సెల్ నెంబర్లు 9154298690, 9154298693, 9154298694, 9154298695లను సంప్రదించి సంస్థ ఆదాయం పెరిగేందుకు సహకరించాలని కోరారు. నల్లగొండ రీజనల్ పరిధిలోని వివిధ గ్రామాలు, మండలాలు, పట్టణాలకు చెందిన సోదరులు, సోదరీమణులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సోదరులు, సోదరీమణులు రాలేకపోతున్న వారికి రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని వారి నివాసాలకు పంపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎర్రకోటలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

● అభినందించిన బండి సంజయ్



ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న తెలంగాణ ఎన్‌ఎస్‌ఎస్ వాలింటీర్లు, ఆఫీసర్ కోటయ్య

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 16: దేశ రాజధానిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లుగా రాష్ట్రంలోని నాలుగు విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న విద్యార్థులను తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో సేవలందిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన 16 మంది వలంటీర్లను ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వారితో పాటు ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలందిస్తున్న నర్సింగ్ కోటయ్యను కంటింజెంట్ లీడర్‌గా ఎంపికయ్యారు. 16 మందితో కూడిన బృందంతో ఈ నెల 13న ఢిల్లీ వెళ్లి ఉత్సవాల్లో పాల్గొని శుక్రవారం రాష్ట్రానికి చేరుకుంది.

● స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఢిల్లీలోని తన నివాసానికి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. కేంద్రమంత్రి మనసుక్ మాండవ్య కంటింజెంట్ లీడర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించి వలంటీర్లలో ఉత్సాహం నింపినట్లు కోటయ్య తెలిపారు.

● కృష్ణమ్మ రాకతో..

ఆయకట్టుకు ఊపిరి

● సాగు పనుల్లో బిజీగా రైతులు ● పెరిగిన భూగర్భ జలాలు
● వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతం



నీరు పారుతున్న ఎడమ ప్రధాన కాల్వ

మిర్యాలగూడ (వ్యవసాయం), ఆగస్టు 16: దశాబ్ద కాలంగా పచ్చని పంటలతో ధాన్యాగారంగా మారిన సాగర్ ఆయకట్టు ఒక్క ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఎడారిగా మారింది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చుక్క నీటికోసం వెంపర్లాడాల్సిన దుస్థితి. అన్నదాతలు ఆర్థికంగా చితికిపోయారు. ఈ ఏడాది జూన్ నుంచే జల్లులు మినహా భారీవర్షాలు పడలేదు. దీంతో పంటల సాగుపై రైతులు ఆశ వదులుకొని నైరాశ్యంలో మునిగిపోయారు. కృష్ణా నదికి పైభాగంలో భారీ వర్షాలు పడటంతో వారం రోజుల వ్యవధిలో ఆయకట్టుకు నీటి విడుదల జరిగింది. కృష్ణమ్మ పరవళ్లతో నేల పులకరించింది. అన్నదాతలకు ఊపిరిపోసింది. పంటల సాగుకు ఆయకట్టు సమాయత్తం అవుతుంది.



కాల్వ ఆధారంగా పోసుకున్న నారు

వరి సాగు షురూ..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా లో 6.50లక్షల ఆయకట్టు ఉంది. సాగర్ నిండటంతో ఈ ఏడాది రెండు సీజన్లకు అవసరమయ్యే సాగునీరు ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. రైతులు వరి సాగు పొలాలు దుక్కులు దున్ని, నారుమడులు పోసుకుని వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. గతేడాది సాగర్ నీటి విడుదల లేకపోయినా బోరుబావుల ఆధారంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. కాల్వ నీటితో సాగు జరిగే భూములు పడావుగా మారాయి. ఏడాది పాటు పొలాలు బా గా ఆరిపోయి ఉండటంతో ఈ సారి పంటలు బాగా పండుతాయని వ్యవసాయ నిపుణులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగా వర్షాలు లేకపోయినా....

గత ఏడాది నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ఆయకట్టులో భూగర్భజలాలు వంద అడుగులపైగా కిందికి వెళ్లిపోయాయి. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 91.3 మి.మీ కాగా 166 మి.మీ వర్షం కురిసింది. దీంతో 81.7 అధికంగా నమోదైనట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటి వరకు సరైన వర్షా లు పడలేదు. ఆయకట్టులో పెద్దవూర, అనుముల, నిడమనూరు, మిర్యాలగూడ ప్రాంతాల్లో అధికారులు చెబుతున్న గణాంకాల్లో సగం వర్షపాతం నమోదు కాకపోవడం విచారకరం. ఇప్పటివరకు ఏ చెరువు, కుంటలు, బావుల్లో చుక్కనీరు రాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు వందలాది బోర్లు వేసి లక్షలాది రూపాయలు నష్టపోయి అప్పులపాలయ్యారు. కృష్ణాజలాల రాకతో ఆయకట్టు దృశ్యం మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో చెరువులు బోరు బావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆయకట్టులో నాటు వేసేందుకు పొలం దున్నుతున్న రైతు

వ్యవసాయ పనులతో సందడి

ఆయకట్టు ప్రాంతాల్లో పంటల సాగుకు అనుబంధంగా ఎన్నో రంగాలు వెలిశాయి. దశాబ్దకాలంగా ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో ఎరువులు, విత్తన దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో మండల కేంద్రంలో సుమారు 20-30 వరకు దకాణాలు ఉన్నాయి. గత ఏడాది నీటి విడుదల లేకపోవడంతో వ్యాపారాలు నడవక దుకాణదారులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలుతో పాటు ఎరువులు, పురుగు మందులను రైతులు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. వ్యవసాయ యంత్రాలు, పరికరాలు తయారు చేసే వెల్డింగ్ దుకాణాలతో పాటు, ట్రాక్టర్ మరమ్మతులు చేసే షెడ్లు, పరికరాలు విక్రయించే ఆటోమొబైల్ దుకాణాలు, కమ్మరి కొలిమిలకు కృష్ణమ్మ ఊపిరిపోసింది. ప్రస్తుతం ఆయకట్టులో వ్యవసాయ పనులతో సందడిగా మారింది.

పరికరాల పనిలో నిమగ్నమయ్యాం



ఏడాది నుంచి చేతిలో పని లేక చాలా ఇబ్బందులు పడ్డాం. సాగర్ కాల్వలకు నీటి విడుదల జరగడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లకు ఉపయోగించే నాగళ్లు, వీల్స్ తయారీ పనుల్లో నిమగ్నమయ్యాం. ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది.

- చరణ్, వెల్డింగ్ షాపు నిర్వాహకుడు, మిర్యాలగూడ

సాగర్ నీళ్లొస్తేనే ఉపాధి



సాగర్ నిండితేనే చేతి నిండా పనులు ఉంటా యి. ఈ ఏడాది ఆయకట్టుకు నీటి విడుదల చేయడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. మరమ్మతుల పనుల్లో బిజీగా ఉన్నాం. పంటల నీటికి ఢోకా లేకపోవడంతో ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

- శ్రీలోజు జానకిరాములు, ట్రాక్టర్, మెకానిక్


నీటి విడుదలతో పంటల సాగు



గత ఏడాది వర్షాలు లేక బోర్లు వేసి లక్షల రూపాయలు నష్టం పోయాం. ఈ ఏడాది సాగర్ నిండి నీటి విడుదల చేయడంతో వరి సాగుకు సిద్ధమవుతున్నాం. స్థానికంగా వర్షాలు పడకపోయినా కాల్వ నీటితో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సయ్యద్, రైతు, త్రిపురారం

సాగర్ 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ 4 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 16: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 1,06,419 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో శుక్రవారం సాయంత్రానికి 881.40 అడుగులుగా (195.6605టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,746 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 79,535 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 68,746 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద శుక్రవారం సాయంత్రానికి 662.03 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46టీఎంసీల) అడుగులు కాగా ప్రస్తుతం 642.33(3.78టీఎంసీల) అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి, ఎడమ కాల్వలకు 258.39 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలలో...

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి చేరువలో ఉంది. గరిష్ట నీటిమట్టం 175అడుగులు(45.77టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 174.44అడుగులకు(44.84 టీఎంసీల) చేరింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 43,478 క్యూసెక్కులు కాగా రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు ఎత్తి 41,736 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 57,736 క్యూసెక్కులుగా ఉంది.



నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు

నేడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవల నిలిపివేత



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

నల్లగొండ, మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: కోల్‌కతాలో ఈ నెల 9వ తేదీన పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్య ఘటనకు నిరసనగా శనివారం అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అన్ని సేవలు నిలిపివేయనున్నట్లు ఐఎంఏ అధ్యక్షురాలు జి.అనితరాణి, ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌డాంగ్రే, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్.రమేష్ మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీవన జ్యోతి, డాక్టర్ సరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఉదయం 6 నుంచి 18వ తేదీన ఉదయం 6 గంటల వరకు దేశవ్యాప్తంగా ఓపీ సేవలు నిలిపివేయడానికి నేషనల్ ఐఎంఏ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇది ఒక వైద్యురాలిపై జరిగిన దాడి లాగానే కాకుండా ఓ స్త్రీమూర్తిపై జరిగిన దాడిగా మానవత్వంపై జరిగిన అమానుష దాడిగా భావిస్తున్నామన్నారు. కాగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలకు చెందిన జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కళాశాల నుంచి ర్యాలీని పలు కూడళ్లలో నిర్వహించి హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఐఎంఏ బృందం

జిల్లాలో ఇటీవల నూతనంగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన పుట్ల శ్రీనివాస్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్యాంకు తరపున డాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డాక్టర్లు అనితారాణి, పుల్లారావు, రమేష్, ప్రవీణ్, రాజేశ్వరి, అరుంధతి, వసంతకుమారి, సుచరిత, గౌరీశ్రీ, చంద్రమౌళి, రాంమనోహర్, ఈశ్వర్, వినయ్, వేణుగోపాల్‌రెడ్డి, కల్యాణచక్రవర్తి, రవి, శ్రీకాంత్ వర్మ, శశిధర్ ఉన్నారు.

యూరియా కోసం అన్నదాతల పరుగులు



యూరియా తీసుకువెళ్లేందుకు తెచ్చిన ఆటోలు

నిడమనూరు, ఆగస్టు 16: యూరియా కోసం అన్నదాతలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిడమనూరు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట శుక్రవారం యూరియా టోకెన్ల కోసం రైతులు ఎగబడ్డారు. వానాకాలం సీజన్‌లో మండలంలో వరి సాగు గణనీయంగా పెరగడంతో రైతుల అవసరాల మేరకు మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. ఎరువుల దుకాణాల్లోనూ యూరియా లభించడం లేదంటున్నారు. స్టాకు లేదని చెబుతూనే కొందరు దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పీఏసీఎస్ సొసైటీ ద్వారా 45 కిలోల బస్తాను రూ.266కు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు సొసైటీల వద్ద ట్రాక్టర్లు, ఆటోలతో నిరీక్షిస్తున్నారు. యూరియా నిల్వలు అవసరమైన మేరకు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని నిడమనూరు సొసైటీ బుచ్చాల జానయ్య తెలిపారు. అందరికీ యూరియా అందిస్తామని పేర్కొన్నారు.

భార్య హత్య కేసులో అరెస్టు

అనుమానంతోనే ఘాతుకం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 16: కులాంతర వివాహం చేసుకున్న భార్యను చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన దాసోజు బ్రహ్మచారి 2014లో నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సరితను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డోర్ల పాలిష్ పనులు చేసే బ్రహ్మచారి మద్యానికి అలవాటుపడ్డాడు. ఈవిషయంలో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఇద్దరు పిల్లలను సరిత కుటుంబ సభ్యులు తీసుకువెళ్లి పోషిస్తున్నారు. మూడేళ్ల కుమారుడు బ్రహ్మచారి-సరిత వద్ద ఉంటున్నాడు. సూర్యా పేటలోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బ్రహ్మచారి దంపతులు నివసిస్తున్నారు. బ్రహ్మచారి డోర్ పాలిష్ పనులకు వెళుతుండగా, సరిత ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. కాగా, భార్య సరితపై భర్త బ్రహ్మచారికి అనుమానం మొదలైంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 14న ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆగ్రహంతో బ్రహ్మచారి ఇంట్లో ఉన్న జీఐ వైరును సరిత మెడకు బిగించి హత్య చేశాడు. అనంతరం సరిత కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరితను పరీక్షించిన వైద్యులు ఆస్పత్రికి తీసుకరాక ముందే మృతి చెందిందని తెలిపారు. దీంతో వెంటనే బ్రహ్మచారి అక్కడినుంచి పరారయ్యాడు. సరిత తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బ్రహ్మచారికి చిలుకూరులో అరెస్టు చేయగా, భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. బ్రహ్మచారిని సూర్యాపేట కోర్టులో హాజరుపరుస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్‌ఐ ఎం.లింగయ్య, ఏఎస్‌ఐ మేకపోతుల శంకర్, అభిషేక్ ఉన్నారు.

వరలక్ష్మీ కరుణించుమా..

జిల్లా వ్యాప్తంగా వ్రతాలు

మఠంపల్లి, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని దుర్గానగర్ కనకదుర్గా దేవాలయంలో సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టత, ప్రాముఖ్యాన్ని భక్తులకు ఆలయ అర్చకుడు సోమయాజుల సూర్యనారాయణమూర్తి, శైలజ వివరించారు. ఈ వ్రతంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహవేణుగోపాలస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత పూజలను సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మణ్‌రావు,అర్చకులు హరీష్‌కుమారచార్యులు, గిరిధర్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నేరేడుచర్ల: పట్టణంలోనిఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఉగ్రదండి శివ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాంకోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు, నడిగూడెం: చిలుకూరు నడిగూడెం మండలాల్లోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పూజాల్లో పాల్గొన్నారు.



నేరేడుచర్లలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

తుంగతుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఆచరించారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తారని, శ్రావణమాసం రెండో శుక్రవారం లక్ష్మీదేవిని పూజిస్తారని పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని 29గ్రామ పంచాయతీల్లో వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు.

నూతన్‌కల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి రకరకాల నైవేద్యాలను భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించారు.

సూర్యాపేట అర్బన్: సూర్యాపేటలో వరలక్ష్మీ వ్రతాలు, పూజలు వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాతా దేవాలయం, 37వార్డులోని శ్రీమహాలక్ష్మీ నిలయంలో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఆచరించారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీచక్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం, ఉద్యాపన వ్రతం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా లక్ష్మీవ్రతం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సతీమణి పటేల్ లావణ్య దేవాలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీరలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి



తుంగతుర్తిలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



మఠంపల్లిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా భక్తులు

గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతి



ముత్యాలమ్మకు సల్లగూడు అందిస్తున్న మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమబాబు

కోదాడ టౌన్, ఆగస్టు 16: గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతి అని కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమబాబు అన్నారు ముత్యాలమ్మ పండుగకు ముందు సంప్రదాయంగా అమ్మవారికి సమర్పించే సల్లగూడు నైవేద్యాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రావెళ్ల కృష్ణారావు,రామారావు, భక్తులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాలు,కనకదుర్గమ్మతో పాటు వివిధ గ్రామ దేవతల పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలువురు భక్తులు ట్రాక్టర్లతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి



సోమనర్సయ్య (ఫైల్ ఫొటో)

నాగారం, ఆగస్టు 16: రోడ్డు ప్రమాదంలో నాగారంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ అసిస్టెంట్ వేల్పుల సోమనర్సయ్య(50) శుక్రవారం రాత్రి మృతిచెందారు. నాగారం ఎస్ఐ ఎం.ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రంలో అద్దె భవనం వశిష్ట కళాశాలలో నాగారం బీసీ గురుకుల పాఠశాల ఉంది. పాఠశాలలో శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని సూర్యాపేటలోని ఇంటికి వెళుతుండగా సూర్యాపేట-జనగాం జాతీయ రహదారి 365పై నాగారం బంగ్లా గ్రామ శివారులోని విజయ్‌నగర్‌కాలనీ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలాడాఉ. స్థానికుల సమాచారం మేరకు నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఎం.ఐలయ్య ఘటనా స్థలానికి చేరుకుని సోమనర్సయ్యకు సీపీఆర్ చేసినా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సోమనర్సయ్య స్వస్థలం తిరుమలగిరి మండలం తొండ గ్రామం. సోమనర్సయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. సోమనర్సయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమనర్సయ్య గతంలో అర్వపల్లి మండలంలో వీఆర్వోగా విధులు నిర్వహించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నేరేడుచర్ల, ఆగస్టు 16: పట్టణంలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహాల, ధ్వజ స్తంభం ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించున్నారు. ఈ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

అర్వపల్లి, ఆగస్టు 16: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన సాయిని ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందాచార్యులు ముత్తమ్మ చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, నసీర్‌గౌడ్, బద్రి, సందీప్ పాల్గొన్నారు.

చిలుకూరు వాసికి డాక్టరేట్



చిలుకూరు, నడిగూడెం, ఆగస్టు 16: చిలుకూరు మండల కేంద్రానికి చెందిన షేక్ జానీపాషాకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో "ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ముస్లిం మైనార్టీ-ఏ స్టడీ ఇన్‌ద సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందజేశారు. జానీపాషా ప్రస్తుతం నడిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

నడిగూడెం, ఆగస్టు 16: మండలంలోని చెన్నకేశవపురంలో కోతుల దాడిలో గ్రామానికి చెందిన భద్రమ్మ శుక్రవారం తీవ్రంగా గాయపడింది. కోతుల బెడద నుండి గ్రామస్థులను కాపాడాలని సీఎస్‌సీ కేంద్ర నిర్వాహకుడు మేకల నాగరాజు కోరారు.

హిందువులపై దాడిని అరికట్టాలి

నేరేడుచర్ల, ఆగస్టు 16: బంగ్లాదేశ్ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐక్య హిందూ సంఘాల నాయకులు కోరారు. హింసాకాండకు నిరసనగా శుక్రవారం నేరేడుచర్లలో ఐక్య హిందూ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ కాషాయ జెండాలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీలతారెడ్డి, పాల్వాయి రమేష్, బాల వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజపేయి సేవలు మరువలేనివి

కోదాడ టౌన్, ఆగస్టు 16: దేశానికి మాజీ ప్రధాని వాజపేయి అందించిన సేవలు మరువలేనివని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం కోదాడలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వాజపేయి ఆరో వర్ధంతిలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజపేయి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. వాజపేయి జీవిత్రం ప్రతి నాయకుడికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యాదా రమేష్, శ్రీమతి నూనె సులోచన, ఓరుగంటి పురుషోత్తం, యరగాని రాధాకృష్ణ, వందనపు సురేష్, కట్టకోజు నాగేంద్రాచారి, ఉడతా విశ్వనాథ్, వంగాల పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, రామమూర్తి, నాగేశ్వరరావు, జల జనార్దన్, ఎల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోరెంట్ల వీబీకేపై అధికారులు చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా సమభావన సంఘబంధ సభ్యులు

మద్దిరాల, ఆగస్టు 16: మహిళా సమభావన సంఘబంధ సభ్యుల డబ్బులను సొంతానికి వినియోగించుకున్న మండలంలోని గోరెంట్ల గ్రామ వీబీకే సూర శైలజపై చర్యలు తీసుకోవాలని కోవాలని సంఘం సభ్యులు పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలోని గోరెంట్ల గ్రామ వీబీకే సూర శైలజ మహిళ సంఘాల డబ్బులు రూ.28లక్షలు సొంతానికి వాడుకుందని, జిల్లా అధికారుల సమక్షంలో డబ్బులు చెల్లిస్తానని శైలజ ఒప్పుకుందన్నారు. డబ్బులు అడిగితే తప్పించుకుని తిరుగుతుందన్నాదన్నారు. నేటి వరకు ఆమె నుంచి డబ్బులు రికవరీ చేయలేదన్నారు. వీబీకే శైలజపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమభావన సంఘ బంధ సభ్యులు వెంకటమ్మ, ఎల్లమ్మ, రేణుక, మంజుల, అలివేలు, యశోద, తారమ్మ, మల్లమ్మ, కవిత, ప్రమీల, శైలజ, సువర్ణ శశిరేఖ, మరియమ్మ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించండి సారూ..

- నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చినా అధికారుల సహకారం కరవు
- మునగాల మండలంలో 30 గ్రామాల ప్రజలకు అవస్థలు

మునగాల, ఆగస్టు 16: మండల కేంద్రంలో బస్ షెల్టర్లు లేనందున ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మునగాల మండల కేంద్రం 65వ నెంబరు జాతీయ రహదారి వెంట ఉంది. మునగాలలో బస్‌షెల్టర్లు నిర్మించకపోవడం అధికారుల, పాలకుల పనితీరుకు అద్దంపడుతోంది. మండల కేంద్రం చుట్టు పక్కల ఉన్న 30 గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లాలంటే మండల కేంద్రానికి వచ్చి బస్ ఎక్కాలి. మునగాల నుంచి విజయవాడ వైపు వెళ్లాలన్నా, హైదరాబాద్ వైపు వెళ్లాలన్నా బస్ షెల్టర్లు లేవు. దీంతో కూర్చోడానికి స్థలం లేకపోవడంతో పాటు ఎండకు, వానకు . వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు బస్‌షెల్టర్ నిర్మించడానికి సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు.100మీటర్ల దూరం రోడ్డును పూర్తి చేయడానికి వక్ఫ్ బోర్డు స్థలం 12ఏళ్లుగా కోర్టు వివాదంలో ఉంది. ఇక్కడ సర్వీసు రోడ్డు పూర్తి చేస్తేనే బస్ షెల్టర్ నిర్మించడానికి అవకాశం ఉంటుంది. 2011లో జాతీయ రహదారి విస్తరణలో మునగాలలో హైదరాబాద్ హైవే బస్ స్టాప్ వద్ద కాకుండా కొంత దూరంలో బస్ షెల్టర్‌ను నిర్మించారు. అది ప్రయాణికులకు ఉపయోగపడటంలేదు. ప్రయాణికుల ఇబ్బందులను చూసి బస్ షెల్టర్లు నిర్మించడానికి కొంతమంది రిటైర్డు ఉద్యోగులు ముందుకు వచ్చారు. మునగాలలో ఖాళీగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కొందరు కబ్జా చేసి డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డబ్బా కొట్లను ఖాళీ చేయిస్తే ఆ స్థలంలో బస్ షెల్టర్లు నిర్మిస్తామని రిటైర్డు ఉద్యోగులు పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులు విన్నవించినా స్పందనలేదని పలువురు రిటైర్డు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బస్ షెల్టర్ల నిర్మాణానికి సహకరించాలని రిటైర్డు ఉద్యోగులతో పాటు స్థానికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్ లేక ఎండలో ఉన్న ప్రయాణికులు


నీడ లేక ఇబ్బంది పడుతున్నాం



హైదరాబాద్‌కు వెళ్లాలంటే బస్ కోసం ఎండలో వేచి చూడాల్సి వస్తోంది. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.ప్రభుత్వం స్పందించి బస్ షెల్టర్లను నిర్మించాలి.

● ఎస్.రామిరెడ్డి, నారాయణగూడెం

నిర్మాణానికి ముందుకు వచ్చినా స్పందనలేదు



మునగాలలో బస్ షెల్టర్ల నిర్మాణానికి రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముందుకువచ్చా. అడ్డుగా ఉన్న డబ్బా కొట్లను తొలగించాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందనలేదు.

● కొప్పుల నర్సింహారెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..

మేళ్లచెర్వు, ఆగస్టు 16: రోడ్డు ప్రమాదంలో గురువారం గాయపడిన యువకుడు షేక్ మీరాసా (32) శుక్రవారం మృతి చెందాడు. చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన మీరాసా తన స్నేహితుడు వీరబాబుతో కలిసి గురువారం చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో పాత బైక్ కొనేందుకు వచ్చాడు. అనంతరం పులిచింతల ప్రాజెక్టును సందర్శించి కోదాడకు వెళుతుండగా, దొండపాడు గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. మీరాసా తలకు బలమైన గాయాలు తగలగా, వెనుక కూర్చున్న వీరబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మీరాసాను అంబులెన్స్‌లో జగ్గయ్యపేటకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. అక్కడి నుండి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మీరాసా తండ్రి రఫీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగి ఉపేందర్..



ఉపేందర్ (ఫైల్ ఫొటో)

మఠంపల్లి, ఆగస్టు 16:)హుజూర్‌నగర్ ఆర్డీవో కార్యాలయ రికార్డు అసిస్టెంట్ కొమ్మనబోయిన ఉపేందర్(41)గురువారం రాత్రి మృతి చెందాడు. ఉపేందర్ స్వగ్రామం మఠంపల్లి మండలంలోని ఉమ్మడి చెన్నాయిపాలెం. ఉపేందర్ తండ్రి సైదులు వీఆర్ఏగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందాడు. తండ్రి ఉద్యోగ బాధ్యతలను ఉపేందర్ తీసుకుని హుజూర్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఉపేందర్ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మాలోతు నాగునాయక్, రెవెన్యూ ఉద్యోగులు, నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపేందర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 16: ఆయిల్ పామ్ తోటలను రైతులు సాగు చేస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి ముత్తయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కేసారం రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు కల్పించి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ మొక్కలను నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి మొదలవుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై డ్రిప్, ఎరువులు, అంతర పంటలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ మేనేజర్ శశికుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలిస్తాం

మద్దిరాల, ఆగస్టు 16: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ) పక్కనే ఉన్న డంపింగ్ యార్డును మండలంలోని కుంటపల్లి గ్రామ శివారులకు తరలిస్తామని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం డంపింగ్ యార్డు స్థలాలను వారు పరిశీలించి మాట్లాడారు. మద్దిరాల గ్రామ శివారులో కేజీబీవీ పక్కనే డంపింగ్ యార్డు ఉండడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నందున తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గుండు వెంకన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలి'

అర్వపల్లి, ఆగస్టు 16: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని పలువురు భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అర్వపల్లి-జనగాం రహదారిపై భవన నిర్మాణ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 60ఏళ్ల పైబడిని ప్రతి కార్మికుడికీ నెలకు రూ.10 వేల పింఛను అందజేయాలని డిమాండ్ చేశారు. భవన కార్మికులకు ప్రభుత్వం మోటార్ సైకిళ్లను మంజూరు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు లింగయ్య, మురళి, రామయ్య, కృష్ణ, జమాల్, నాని, రాజయ్య, జహంగీర్, అమర్‌సింగ్, రాంమూర్తి, లాలు, సుమన్, నారాయణ, నాగరాజు, సైదులు, వీరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగు నీటిని విడుదల చేయాలి: బీఆర్ఎస్

నేరేడుచర్ల, ఆగస్టు 16: ఎత్తిపోతల పథకం ఎల్ 27ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేనట్లయితే సాగునీటి కోసం రైతులతో కలిసి ఉద్యమిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు హెచ్చరించారు. శుక్రవారం నేరేడుచర్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వ పాలనలో రైతులు కోరిన వెంటనే ఎల్ 27 ద్వారా నీటిని సరఫరా చేశారని గుర్తు చేశారు. నీటిపారుదలశాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండి కూడా ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీటిని అందించనందున పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటికి అందించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీసీ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీతారామయ్య

మునగాల రూరల్, ఆగస్టు 16: బీసీ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన చెవిరాల సీతారామయ్యను నియమించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో సీతారామయ్యకు నియామకపత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమిటీలు వేసి బీసీ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలు పోరాడాలని పిలుపునిచ్చారు.

వృద్ధురాలికి చేయూత

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 16: మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన ఒంటరి వృద్ధురాలు బెట్టెం సోమనర్సమ్మ ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని ఆ గ్రామ మాజీ సర్పంచ్ కర్ణాకర్ ద్వారా తెలుసుకున్న మన ఫౌండేషన్ చైర్మన్ మహేష్ బియ్యం, నిత్యావసర వస్తువు లను తెలంగాణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పొరెళ్ల విప్లవ్‌కుమార్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెడిద కర్ణాకర్, బాసాని స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మునగాల, ఆగస్టు 16: పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు వ్యాపించవని తహసీల్ధార్ ఆంజనేయులు, ఎండీవో రమేష్‌దీనదయాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు వీధుల్లో ఆయన పర్యటించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, చెత్తాచెదారాన్ని ఇంటి ఆవరణంలో వేయకూడదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 16: జ్వరాలు వ్యాపించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో గిరిబాబు, మండల వైద్యాధికారి కల్యాణి కోరారు. జ్వరాలపై శుక్రవారం మండలంలోని గోపాలపురంలో ఇంటింటి సర్వే నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలందరూ కాచివడపోసిన నీరు తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఇందిర, శ్రీను పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న చేపట్టే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నేరేడుచర్లలో వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్,చందబోయిన లక్ష్మి, నాగేంద్ర, విజయ్, కోటేష్, రజాక్, జానకమ్మ, సైదులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

నేరేడుచర్ల, ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నేరుడుచర్ల పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో డాక్టర్ నాగిణి, డాక్టర్ శ్రుతి, రాంబాయి, నాగేంద్ర, విజయ, సుశీల పాల్గొన్నారు

'రామచంద్రునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 16: డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని తిరుమలగిరి మండల గిరిజన సంఘ నాయకులు ఇస్లావత్ అశోక్, ప్రేమ్‌కుమార్, రామోజీలు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మామిడాల గ్రామంలో వారు మాట్లాడుతూ విశేష రాజకీయ అనుభవం ఉండి, డాక్టర్ వృత్తిలో అనేక మంది పేదలకు సేవలు అందించిన రామచంద్రునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.